క్లుప్తంగా

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న అధికారులు

పెద్దపప్పూరు: మాఘమాసం నాలుగో ఆదివారం అశ్వత్థం తిరునాల సందర్భంగా భక్తుల నుంచి హుండీల ద్వారా వచ్చిన ముడుపులు, కానుకలను సోమవారం దేవదాయశాఖ స్పెషలాఫీసర్ వన్నూరు స్వామి, ఈఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లెక్కించారు. తాత్కాలిక హుండీల ద్వారా రూ.6,63,981, పర్మినెంటు హుండీల ద్వారా రూ.3,64,084, దర్శనం టికెట్ల ద్వారా రూ.1,92,050, తలనీలాల టికెట్ల ద్వారా రూ.24,850, విరాళాల రూపంలో రూ.24,732. అభిషేకం టికెట్ల ద్వారా రూ.500 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, గ్రామపెద్దలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కంటి చూపు కాపాడుకుందాం

యాడికి: ప్రతి ఒక్కరూ కంటి చూపును కాపాడుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ సూచించారు. సోమవారం మండలంలోని రాయలచెరువులో ఉన్న లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగుళూరు శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 25 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రవి ప్రసాద్,ఇస్మాయిల్, అల్లాబకాష్, శేషానందరెడ్డి, మరళీకృష్ణ, సత్యనారాయణ, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


మోడల్ స్కూల్లో కరాటేపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యాడికి: ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని తాడిపత్రి సీడీపీఓ షాజిదా బేగం సూచించారు. సోమవారం మండలంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, యాడికి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు స్వీయరక్షణపై కల్చరల్ టీమ్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగన్న, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లు నిర్మల, మారుతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.విజయకుమారి, నారాయణమ్మ. బి.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి సారూ!


పోలీసులకు వినతిపత్రం అందిస్తున్న చీటీల బాధితులు

గుత్తి: తమకు న్యాయం చేయాలంటూ పలువురు చీటీల బాధితులు సోమవారం గుత్తి పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ పల్లికి చెందిన సుమారు 150 మంది అదే గ్రామానికి చెందిన అంజలి అనే మహిళ వద్ద చీటీలు వేశారు. అయితే రెండు నెలల క్రితం అంజలి సుమారు రూ. కోట్లు ఎగ్గొట్టి ఉడాయించింది. ఈ నేపథ్యంలో సోమవారం 70 మంది బాధితులు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి తమ గోడును సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ వద్ద వెళ్లగక్కారు. న్యాయం చేయాలని వేడుకున్నారు.

కాలనీలో వసతులు కల్పించండి

గుంతకల్లుటౌన్: స్థానిక సీఐటీయూ కాలనీ ఏర్పడి 25 సంవత్సరాలవుతున్నా కనీస వసతులను కల్పించడంలో మున్సిపల్ యంత్రాంగం వైఫల్యం చెందిందని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్ విమర్శించారు. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ ఆఫీసు ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు ధర్నా నిర్వహించారు . కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్లా, ఓబులేసు, సూరి, సుగుణ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివమాలధారుల ఇరుముడి


నగరేశ్వరాలయంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని నగరేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయాల్లో సోమవారం శివ మాలాధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురు స్వాములు వెంకటాద్రి, సురేష్, రమణ స్వాముల సమక్షంలో ఇరుముడి కార్యక్రమాలు చేపట్టారు. వందలాది మంది శివ మాలాధారులు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాశీ విశ్వేశ్వరాలయంలో శివ పార్వతులు కల్యాణోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుల శివ నామస్మరణతో ఆలయం మార్మోగింది

మండే కాలం..జర భద్రం!

- గత ఏడాది 75 ప్రమాదాల్లో... రూ.1.58 కోట్ల నష్టం
- గత 25 రోజుల్లో 18 ఘటనలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు


ఇటీవల గుత్తి మండలం అనగాదొడ్డిలో అగ్ని ప్రమాదంలో కాలుతున్న గడ్డి వాములు

గుంతకల్లు: అసలే వేసవి కాలం. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గుంతకల్లు ఫైర్‌స్టేషన్‌లో 4,500 లీటర్ల సామర్థ్యం కల్గిన రెండు ఫైరింజన్లుతోపాటు బుల్లెట్ ఉన్నాయి. గుంతకల్లు ఫైర్‌స్టేషన్ దాదాపు ఐదు నియోజకవర్గాలకు విస్తరించి సేవలు అందిస్తోంది. గుంతకల్లు నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాలతోపాటు ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు, విడపనకల్లు, తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దవడగూరుతోపాటు కర్నూలు జిల్లాలోని ఆలూరు నియోజకవర్గంలోని చిప్పగిరి, పత్తికొండ నియోజకవర్గంలోని మద్దికెర మండలాలు గుంతకల్లు ఫైర్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయి. దీంతో ఆయా మండలాల్లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు యుద్ధ ప్రాతిపదికన సంఘటన స్థలానికి చేరుకోవడానికి అగ్నిమాపక సిబ్బంది నిత్యం అందుబాటు ఉంటారు. అయితే దాదాపు 50 కి.మీ పరిధి కావడంతో సకాలంలో సంఘటన స్థలాలకు చేరుకోలేక ఆస్తి నష్టం ఎక్కువగానే జరుగుతోంది. ఈ నేపథ్యంలో గుత్తిలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినప్పటికి ఆచరణలో జరగలేదు.

నిర్లక్ష్యంతోనే..

అజాగ్రత్త, నిర్లక్ష్యంతోనే అధిక అగ్ని ప్రమాదాలు చేటుచేసుకుంటున్నాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. గ్యాస్ లీకేజీ, బీడీ, సిగరెట్లు కాల్చి ఎక్కడ పడితే అక్కడ పడేయడం, పిల్లలు నిప్పుతో ఆడుకోవడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు అగ్నిమాపక శాఖకు సమాచారం అందిస్తే వీలైనంత వరకు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా కాపాడుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకూ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించి, అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, కళాశాలు, సినిమా థియేటర్లు, కార్యాలయ వద్ద అగ్నిమాపక సిబ్బందిచే ప్రమాదాలు జరిగితే ఎలాంటి నష్టం వాటిల్లుతుంది? వాటి నివారణ మార్గాలను ప్రజలకు డెమో ద్వారా వివరిస్తారు. ముఖ్యంగా రైతులు పొలాల్లో నిల్వ ఉంచుకున్న గడ్డివాములను ఇతర గడ్డి వాములకు కనీసం 20 అడుగుల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, గుడిసెల్లో నివాసముండే వారు విద్యుత్ వైర్ల జాయింట్స్ లేకుండా చూసుకుంటే షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగవని అధికారులు పేర్కొన్నారు.

గడిచిన ఏడాదిలో 75 అగ్ని ప్రమాదాలు

గుంతకల్లు ఫైర్‌స్టేషన్ పరిధిలో 2024 మార్చి 1వ నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకూ మొత్తం 75 అగ్ని ప్రమాదాలు చేటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల వల్ల రూ.1.58 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని రూ. 3.83 కోట్ల ఆస్తిని కాపాడగలిగారు. కాగా ఈ నెల 23 వతేదీ వరకు దాదాపు 17 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.


గుంతకల్లులో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

అప్రమత్తంగా ఉన్నాం



వేసవి సీజన్ ప్రారంభం కాకుండానే ఎండలు మండిపోతుండడంతో 24 గంటలూ అప్రమత్తంగా ఉంటున్నాం. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవకాశం ఉంది. రోడ్డుకు ఇరువైపులా, ట్రాన్స్‌ఫారాలు ఉండే ప్రాంతాల్లో ఎండిన గడ్డి తొలగించాలి. గడ్డి అలాగే వదిలేస్తే అగ్నిప్రమాదాలు చోటు చేసుకొనే అవకాశం ఉంది. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే 101కు సమాచారం ఇస్తే ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా కాపాడుతాం.

– ఎస్.అశ్వర్థ, ఏడీఎఫ్ఓ, గుంతకల్లు ఫైర్‌స్టేషన్

వైభవంగా ఎర్రితాత, పక్కీరప్ప రథోత్సవం


రథోత్సవానికి హాజరైన భక్తులు

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ పంచాయతీ పరిధిలో ఉన్న పెన్నప్పగుడి వద్ద సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎర్రితాత, పక్కీరప్ప రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు కృష్ణ ఆధ్వర్యంలో ఎర్రితాత, పక్కీరప్ప స్వాములను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 25, 26న న్యూకేటగిరి, ఆరుపళ్ల విభాగపు ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. న్యూకేటగిరి విభాగపు విజేత వృషభాలకు రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేల చొప్పున నగదు బహుమతులు ఉంటాయన్నారు. అలాగే ఆరుపళ్ల విభాగపు పోటీ విజేత వృషభరాజులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహిస్తామన్నారు.

వైభవంగా శిఖర కలశ ప్రతిష్ట

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పుట్లూరు రోడ్‌లోని రైస్ మిల్లు వద్ద ఉన్న మూల పెద్దమ్మతల్లి శిఖర కలశ ప్రతిష్ట సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న గేట్స్ కళాశాల యాజమాన్యం

గుత్తి: అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో గేట్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి అవార్డు సాధించారు. వివరాలు.. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లరిన్నింగ్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అనే కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న సాంకేతిక విద్యా సంస్థల విద్యార్థులు 450 పేపర్ ప్రజెంటేషన్ చేశారు. ఇందులో గేట్స్‌లో ఈసీఈ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు అరవింద్‌కుమార్, గణేష్‌రెడ్డి ఐఓటీ బేస్డ్ స్మార్ట్ హెల్మెట్ ఫర్ బైక్ టాక్సీ రైడర్స్ అనే పేపర్‌ను ప్రజెంట్ చేశారు. నిర్వాహకులు వీరికి ఉత్తమ అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా గేట్స్‌లో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, హెచ్ఓడీ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు


ముసలమ్మ కట్ట వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వర దేవాలయం


మహాశివుడు

బుక్కరాయసముద్రం: హరహర మహాదేవ శంభో శంకరా....అంటూ శివరాత్రి రోజున పరమ శివుని దర్శించుకుంటే జన్మ సుకృతం అవుతుందని ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. ఆ రోజు జాగారణ చేసి పూజలు నిర్వహిస్తూ సకల పాపాలు హరిస్తాయని భక్తుల విశ్వాసం. శివరాత్రి ఉత్సవాలకు బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద కాశీ విశ్వేశ్వర దేవాలయం ముస్తాబవుతోంది. అలాగే మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయం, నీలాంపల్లిలోని నాగలింగేశ్వర స్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సావాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు జిల్లా నలమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నట్లు ఆయయ కమిటీ సభ్యులు తెలిపారు.

పూజలు ఇలా..

మండల కేంద్రంలోని ముసలమ్మ కట్టవద్ద వెలసిన కాశీవిశ్వేర ఆలయంలో బుధ వారం తెల్లవారు జామున 3 గంటలకు సుప్రభాత సేవ, గణపతి హోమం, కలశపూజ, శివునికి పంచామృతా అభిషకము, రుద్రాభిషేకము, ప్రత్యేక పుష్పాలంకరణ, మహా హారతి, రథహారతి, సప్తహారతి, ఉదయం 5 గంటలకు మహా శివుని భక్తులకు సర్వ దర్శనం చేస్తారు. సాయంత్రం పల్లకీసేవ, రాత్రి 9 గంటలకు పంచ హారతి, భజన సంకీర్తనలు, నిర్వహించనున్నారు. అదే రాత్రి 12 గంటలకు లింగోద్భావ పూజ, స్వామి వారికి నైవేద్యం, జామపూజ నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

శింగనమలలో..

శింగనమల: మహాశివ రాత్రి పండుగను పురస్కరించుకుని మండలంలో శివాలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 26న చిన్నజలాలపురంలోని దొణరామేశ్వరాలయం, శింగనమలలోని శివాలయం, రుష్యశృంగుని కొండపైన నున్న శివాలయంతో పాటు ఇతర గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి వేడుకలు నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు సిద్ధం చేస్తున్నారు. శింగనమలలోని శివాలయంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే శింగనమల సమీపంలోని రుష్యశృంగుని కొండపైన శివరాత్రి వేడుకలను నిర్వహిస్తారు. చిన్నజలాలపురంలోని దొణరామేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే మండలంలోని శివపురం, పెరవలి, ఉల్లికల్లు, సలకంచెరువు, మట్లగొంది, సోదనపల్లి, నాయనవారిపల్లి, నిదనవాడ, తరిమెల, కల్లుమడి గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి వేడుకలు నిర్వహిస్తారు. భక్తులు ఆయా ఆలయాల్లో భజనలు, జాగరణ చేస్తారు.


చిన్నజలాలపురంలోని దొణరామేశ్వరాలయంలో శివుడు

కార్మిక సమస్యలపై ధర్నా


ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గుంతకల్లు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఈశ్వరయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి నరసయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మిక సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులకు పట్టించుకోవడం లేదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం మార్చి 3న కలెక్టర్ కార్యాలయం ముట్టడి, మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ నయీమ్ అహమ్మద్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, హనుమంతు, వెంకటేశులు, శ్రీనివాసులు, ఇస్సాక్, చిన్న నరసయ్య, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె/పామిడి: గార్లదిన్నె, పామిడిలోని మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాళ్లు సతీష్, అరుణ వేర్వేరుగా కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ మార్చి 31 లోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీలురూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ఆన్‌లైన్‌లో పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఫలితాల్లో మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

తాడిపత్రి రూరల్: పెట్రోల్ బంకుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కడపరోడ్డు, నంద్యాలరోడ్డు, చుక్కలూరు రోడ్డుల్లో ఉన్న పెట్రోల్ బంకుల నిర్వాహకులతో సీఐ సమావేశమయ్యారు. దొంగతనాలను అరికట్టడానికి, అనుమానాస్పద వ్యక్తుల నుంచి పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న సిబ్బంది, డబ్బును కాపాడటానికి సీసీ కెమెరాలు ఉపయోగ పడతామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెద్దపప్పూరు: మరమ్మతుల్లో భాగంగా మండలంలోని కమ్మవారిపల్లి సబ్‌స్టేషన్‌లో పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నరసింహులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

యల్లనూరు: మండలంలోని పెద్దమల్లేపల్లికి చెందిన బలిజ మాధవి ఫిర్యాదు మేరకు ముచ్చుమర్రి చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి పై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ శ్రీనివాసులగౌడ్ సోమవారం తెలిపారు. 2024 నవంబరు 20న మాధవి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయారన్నారు. నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఐదుగురి బైండోవర్

తాడిపత్రి రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఐదుగురిని సోమవారం తహసీల్దార్ రజాక్‌వలి వద్ద బైండోవర్ చేశామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు. గ్రామంలో సమస్యలు సృష్టిస్తూ కక్షలు పెరగడానికి కారణమవుతుండడంతో బైండోవర్ చేయించామన్నారు. ఇకపై వారు ఘర్షణలకు పాల్పడితే కేసు నమోదు చేయడంతో పాటు బైండోవర్‌లో పేర్కొన్న మొత్తాలను రికవరీ చేస్తామన్నారు.

కోన తిరునాలకు సర్వం సిద్ధం

- 26 నుంచి మార్చి 1 వరకూ ఉత్సవాలు


కోన రామలింగేశ్వరుడి మూలవిరాట్

యాడికి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శైవక్షేత్రాలు శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు ముస్తాబయ్యాయి. యాడికి మండలంలోని కోనుప్పలపాడు గ్రామ సమీపంలో ఉన్న కోనలో తిరునాలకు సర్వం సిద్ధం చేశారు. కోనలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ప్రతి సంవత్సరం మహా శివ రాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. జిల్లా నుంచే కాకుండా కర్నూలు, వైఎస్సార్ జిల్లాల నుంచి వేలాది మంది కోన రామలింగేశ్వరుడిని దర్శించుకుంటారు. ఉత్సవాలను ఈ నెల 26న ప్రారంభించి మార్చి 1 వరకూ నిర్వహించనున్నారు. ఈ నెల 26న సాయంత్రం పుట్టమన్ను తెచ్చుట, రాత్రి రాయభారం, 27న తెల్లవారు జామున 3 గంటలకు స్వామి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన వేదవతి హైస్కూల్ యాజమాన్యం వారిచే అన్నదాన కార్యక్రమం, 2 గంటల నుంచి రథోత్సవం, 28న వసంతోత్సవం, ఓబుళాపురం లో గ్రామోత్సవం, మార్చి1న కోనుప్పలపాడు నుంచి నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం వంక మిట్టపల్లి వరకు గ్రామోత్సవం ఉంటుందని నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, శివరామి రెడ్డి, రామాంజనేయులు తెలిపారు. వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక దర్శనంతో పాటు వైద్య సిబ్బంది పోలీసులు ఉండటానికి సదుపాయాలను కల్పించామన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగింపు

తాడిపత్రి రూరల్ : మండలంలోని సజ్జలదిన్నె క్రాస్ వద్ద సోమవారం పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల పేరుతో పేదలు ఇంటి ముందర ఏర్పాటు చేసిన బండలు, చిన్న బంకులు తొలగించారు. ఆక్రమణల తొలగింపును మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి స్థానిక వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఫోన్‌లో తెలిపారు. ఎలాంటి నోటీసులు లేకుండా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులతో పాటు పేదలకు చెందిన వాటిని ఆక్రమణల పేరుతో తొలగించడం అన్యాయమని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దగ్గరుండి అధికారులు, సిబ్బంది చేత ఆక్రమణల పేరుతో బండలు, దుకాణాలు తొలగించడం వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ తరఫున తగు చర్యలు తీసుకుంటామని వారికి పెద్దారెడ్డి హామీ ఇచ్చారు.

'సంపద కేంద్రాల' పరిశీలన

యల్లనూరు: మండలంలోని కాచర్లకుంట, మేడికుర్తి, వేములపల్లి, నిట్టూరు గ్రామాల్లో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను సోమవారం యాడికి ఎంపీడీఓ వీర్రాజు తనిఖీ చేశారు. కార్యక్రమంలో యాడికి ఏపీఎం చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి


తహసీల్దార్ ఉషారాణికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పెద్దవడుగూరు: ఎన్నికల హామీలు నెరవేర్చాలని సీపీఐ మండల సీనియర్ నాయకులు నారాయణ, సూర్యనారాయణరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇంటి స్థలం లేని నిరుపేదలతో కలసి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి నివేశ స్థలం పంపిణీ చేస్తామని చెప్పి, ఇప్పటి వరకూ పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం స్పందిచి పేదలకు స్థలమిచ్చి, ఇంటి నిర్మాణానికి 5 లక్షలు వెచ్చించాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యలను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఉషారాణికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు సుధాకర్‌గౌడ్, నాగేంద్ర, హుసేన్‌పీరా, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేయండి

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఈ నెల 28న నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేయాలని ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ప్రైవేటు, ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌లో మేధాశక్తి పెంచడానికి, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరు కావాలి

పెద్దవడుగూరు: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావాలని ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ సూచించారు. సోమవారం మండలంలోని చిన్నవడుగూరు గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు పని సామర్థ్యాన్ని పెంచుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.